పరిసరాల శుభ్రతే ముఖ్యం


లింగంపేటలో మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారి రాజు


భిక్కనూరు గ్రామసభలో పాల్గొన్న ప్రజలు


బాన్సువాడలో మొక్కలు అందజేస్తున్న కాసుల బాల్‌రాజ్


రామారెడ్డిలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజేశ్వర్


పిట్లంలో గ్రామస్తుల ర్యాలీ..


బీబీపేటలో ర్యాలీ తీస్తున్న అధికారులు, సిబ్బంది

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో, పట్టణాల్లో ప్రధాన వీధుల గుండా ర్యాలీలు తీశారు. పారిశుధ్యం, వ్యాధులు, మొక్కలు నాటడం తదితర విషయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


నిజాంసాగర్ మండల కేంద్రంలో ర్యాలీ తీస్తున్న అధికారులు, విద్యార్థులు


పెద్ద ఎక్లారాలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ర్యాలీ


రాజంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


సదాశివనగర్‌లో పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అశోక్ రెడ్డి


తాడ్వాయిలో ఆర్డీవో రమేశ్ ఆధ్వర్యంలో ర్యాలీ


గాంధారిలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు


తాడ్వాయిలో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ రాజారాం


నస్రుల్లాబాద్‌లోని దుర్కిలో ర్యాలీలో అధికారులు


మాచారెడ్డిలోని బంజపల్లిలో విద్యార్థుల ర్యాలీ


నాగిరెడ్డిపేటలోని గోపాల్‌పేటలో విద్యార్థుల ర్యాలీ

క్లుప్తంగా

మిర్జాపూర్ జీపీ పరిశీలన

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మిర్జాపూర్ జీపీని సోమవారం మండల ప్రత్యేక అధికారి దయానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలను, పారిశుధ్య పనులను సందర్శించారు. గ్రామంలో సభ ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం స్వచ్ఛదనం–పచ్చదనంలో పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సూర్యకాంత్, పంచాయతీ కార్యదర్శి రవి కుమార్, నాయకులు వెంకట రమణ,మారుతి, గంగాధర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కళాబృందం సభ్యులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీసేఫ్, సైబర్‌క్రైమ్, షీటీం, రోడ్ సేఫ్టీ, మానవ అక్రమ రవాణా, నూతన చట్టాలపై కళాబృందం సభ్యులు ఎలా అరికట్టాలో వివరించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రభాకర్, ఏఎస్సై ప్రకాష్, రాజేందర్, కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని మాతుసంగెంలో సోమవారం తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్ తపాల సేవలపై ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి డాక్ కమ్యూనిటీ అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాంధారి సబ్ పోస్ట్‌మాస్టర్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



కామారెడ్డి అర్బన్ : ఎస్సీ వర్గీకరణ వద్దురా–కలిసివుంటే ముద్దురా అనే నినాదంతో మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా శాఖ అధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందజేసి నివాళ్లు అర్పించారు. మాల మహానాడు నాయకులు మీసాల సత్యం, సంగి రాజలింగం, ఎడ్లరాజు, సుతరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి



ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని మౌలాన్‌ఖేడ్‌లో సోమవారం భవన నిర్మాణ కార్మిక ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల జెండాను సంఘం నాయకులు ఆవిష్కరించారు. నాయకులు సాయిలు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బజరంగ్‌దళ్ కమిటీ ఏర్పాటు



ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామంలో బజరంగ్‌దళ్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బజరంగ్‌దళ్ నాయకులు సోమవారం తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా విఠల్, ఉపాధ్యక్షులుగా బాలరాజు, కార్యదర్శిగా పండరిని ఎన్నుకున్నారు.

నియామకం



మాచారెడ్డి : జాతీయ మానవహక్కుల కమిటీ మండలశాఖ అధ్యక్షుడిగా భరత్‌యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మర్రి మహిపాల్ పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా పుట్ట కొక్కుల నర్సింలును నియమించినట్లు మర్రి మహిపాల్ తెలిపారు. వారికి నియామక పత్రాలు అందజేశారు.

ప్రీతం కుటుంబాన్ని ఆదుకుంటాం

భిక్కనూరు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సౌత్‌క్యాంపస్ విద్యార్థి ప్రీతం కుటుంబానికి తెలంగాణ యూనివర్సిటీ అండగా ఉంటుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. సోమవారం సౌత్ క్యాంపస్‌లో నిర్వహించిన ప్రీతం సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ ప్రీతం కుటుంబాన్ని ఏ విధంగా ఆదుకోవాలనే విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం ప్రీతం ప్రాణం బలిగొందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకుడు నారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ప్రొఫెసర్లు లలిత, హరిత, ప్రతిజ్ఞ, అంజయ్య వీరభద్రం, మోహన్‌బాబు పూర్వ విద్యార్థి వంగ రాహుల్ నేత తదితరులున్నారు.


ప్రీతంకు నివాళులు అర్పిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

కిటకిటలాడిన ఆలయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : శ్రావణమాసం ప్రారంభమైన నేపథ్యంలో నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఆలయాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని శివాలయాలతో పాటు మండలంలోని తాండూర్‌లో ఉన్న శ్రీ త్రిలింగేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. దీంతోపాటు ఆలయంలోని స్వామివారికి అభిషేకాలు జరిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త అక్కలి సాయిరెడ్డి సోమవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఉన్నారు.

రెవెన్యూ ఉద్యోగికి సన్మానం

మద్నూర్(జుక్కల్) : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్‌ను కార్యాలయంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.




బీఆర్ఎస్‌కే సంఘం జెండావిష్కరణ



భిక్కనూరు : మండల కేంద్రంలోని స్థానిక తెలంగాణ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆవిర్భావాన్ని పురస్కరించుకొని భిక్కనూరు టౌన్ మేస్త్రీలు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బండి నాగులు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు తాటికొండ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు జాల రాజు చుక్కయ్య గంగారాం తదితరులున్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



కామారెడ్డి అర్బన్ : మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఇంపాక్ట్ ట్రైనర్, మోటివేటర్ రమేష్ చైతన్య అన్నారు. కామారెడ్డి గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల బారిన పడిన వారి వివరాలను టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలిపితే గోప్యంగా కౌన్సెలింగ్ ఇచ్చి చికిత్స చేస్తామన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ అమర్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

బాన్సువాడ : బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆస్పత్రి ఆర్ఎంవో సుజాతకు సోమారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు మాట్లాడుతూ బాన్సువాడ ఏరియా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాలను కాంట్రాక్టర్ మూణ్నెళ్లుగా చెల్లించట్లేదన్నారు. కార్మికులు సంతోష్‌గౌడ్, కమర్, సురేఖ ఉన్నారు.

రామారెడ్డి : రామారెడ్డిలో సోమవారం కార్మికులు జెండాను ఆవిష్కరించిన అనంతరం భవన నిర్మాణ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు దేమే రవి, ఉపాధ్యక్షులు కనకంటి రాజు, ప్రధాన కార్యదర్శిగా బింగిప్రసాద్, కోశాధికారిగా ఎడ్ల బాలరాజు, జాయింట్ సెక్రటరీగా దండబోయిన చంద్రంను ఎన్నుకున్నారు.


ఆర్ఎంవో సుజాతకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కాసుల బాల్‌రాజ్‌కు సన్మానం



బాన్సువాడ : రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌కు సోమవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆగ్రో చైర్మన్ పదవి చేపట్టిన తర్వాత మొదటి సారిగా మున్సిపల్ కార్యాలయానికి రావడంతో ఆయనను సన్మానించారు. కాసుల బాల్‌రాజ్ ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్‌గా కూడా ఉన్నారు. బాన్సువాడకు చెందిన వ్యక్తికి రాష్ట్రస్థాయి పదవి వరించడం హర్షనీయమని మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. అనంతరం మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిని సన్మానించారు.

భిక్కనూరులో డెమోను ఆపాలి



భిక్కనూరు : భిక్కనూరు రైల్వేస్టేషన్‌లో డెమో ప్యాసింజర్ రైల్‌ను ఆపాలని సిద్దరామేశ్వరనగర్ గ్రామస్తులు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ భానోశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రతిరోజు ఉదయం నిజామాబాద్ నుంచి కాచిగూడ వెళ్లే డెమో రైల్‌ను రాత్రి కాచిగూడ నుంచి నిజామాబాద్ వెళ్లే డెమో ప్యాసింజర్ రైల్‌ను భిక్కనూరు స్టేషన్‌లో నిలుపాలని వారు వినతిపత్రంలో కోరారు. తమ వినతి పత్రాన్ని రైల్వే అధికారులకు పంపాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యువకులు బత్తుల ఆనంద్, ఎలుగు సిద్దు, బోనాల హరీంద్ర, పుట్ట నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్డు పనులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని ప్రధాన రహదారి నుంచి పోచారం ప్రాజెక్ట్ వద్ద గంగమ్మగుడి వరకు గ్రావెల్(మొరం)రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారి నుంచి 400 మీటర్ల మేర మొరం పోసి రోడ్డు వేసేందుకు రూ. 9.95లక్షల నిధులు మంజూరైనట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ప్రధాన రహదారి నుంచి గంగమ్మగుడి వరకు మొరం పోస్తున్నారు. అక్కడ రోడ్డు వెడల్పు చేయించడంతోపాటు రోడ్డుమధ్యలో సిమెంట్ పైపులతో కల్వర్టు నిర్మించనున్నారు. దీంతోపాటు రోడ్డుకు ఒకవైపు కచ్చడ్రైన్ ఏర్పాటు చేయనున్నారు.

తీరనున్న తిప్పలు..

ప్రధాన రహదారి నుంచి పోచారంప్రాజెక్ట్ వద్దకు వెళ్లే రోడ్డు సరిగ్గా లేకపోవడంతో పలుమార్లు ప్రముఖులతోపాటు సామాన్యప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాలు విస్తారంగా కురిసి పొంగిపొర్లే ప్రాజెక్ట్‌ను వీక్షించేందుకు ఎమ్మెల్యేతోపాటు జిల్లా స్థాయి అధికారులు ప్రాజెక్ట్ వద్దకు వెళ్లేందుకు తిప్పలు పడేవారు. వర్షానికి రోడ్డంతా చిత్తడిగా మారి పెద్దపెద్ద గుంతలు ఏర్పడేవి. ప్రధాన రహదారి నుండి ప్రాజెక్ట్ వద్దకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పలుమార్లు ట్రాక్టర్లపై కూర్చొని వెళ్లేవారు. ఈ క్రమంలో ప్రధాన రహదారి నుండి గంగమ్మగుడి వరకు రోడ్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.


ప్రాజెక్టు వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని తిమ్మోజీవాడిలో సోమవారం మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. గ్రామంలో లోవోల్టేజి సమస్య ఉందని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను పరిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ రావు, మాజీ ఉప సర్పంచ్ సాకలి రాజన్న ఉన్నారు.



ఆధ్యాత్మికం

కాలభైరవుడికి శ్రావణమాస పూజలు



రామారెడ్డి : శ్రావణ మాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీకాళభైరవుడి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం తొలి సోమవారం భక్తులు స్వామిని భక్తితో కొలిచారు. ఆలయ ఈవో ప్రభు గుప్తా మాట్లాడతూ భక్తులు రూ. 300 చెల్లిస్తే శ్రావణమాసాంతం గోత్రనామాలపై అభిషేకం నిర్వహిస్తామని, రూ.2 వేలు చెల్లిస్తే కాలభైరవుడికి శ్రావణమాసాంతం సింధూర పూజలు నిర్వహిస్తామని తెలిపారు. రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు చేశామన్నారు. అర్చకులు శ్రీనివాస శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజ్ పాల్గొన్నారు.

రామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో సోమవారం శ్రావణమాసం సందర్భంగా రామేశ్వరాలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం

కామారెడ్డి అర్బన్: శ్రావణ మాసం సందర్భంగా ఈనెల 6,7 తేదీల్లో ఆర్యూర్ కన్యకాపరమేశ్వరీ ఆలయం సమీపంలోని నటరాజ్ భవన్‌లో ద్వాదశ జ్యోతిర్లింగ దివ్య దర్శనం ఏర్పాటు చేసినట్లు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇంచార్జి రాజయోగిని జయదీదీ తెలిపారు.

సిద్దరామేశ్వరాలయంలో పూజలు



భిక్కనూరు : దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం శ్రావణమాసం తొలిరోజు మొదటి సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామునుంచే భక్తులు ఆలయానికి వచ్చి మూల బావి వద్ద స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సామూహిక అభిషేకంలో పాల్గొన్నారు. వేదబ్రాహ్మణులు సిద్దగిరి శర్మ, రామగిరిశర్మ, రాజేశ్వరశర్మలు భక్తుల చేత స్వామివారి అభిషేకాలు, మాత భువనేశ్వరీదేవికి కుంకుమ పూజలు చేయించారు. కొందరు కోడె దూడలు సమర్పించారు. అన్నదాన చేశారు. ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డితో పాటు చీకోటి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు వీహెచ్‌పీ బజరంగ్ దళ్ కార్యాలయం ప్రారంభం

కామారెడ్డి అర్బన్ : విశ్వహిందూ పరిషత్ యువ విభాగం బజరంగ్‌దళ్ కార్యాలయం ఈనెల 6న మంగళవారం ఉదయం 9గంటలకు స్థానిక సర్దార్ పటేల్ విగ్రహం సమీపంలో ప్రారంభించనున్నట్లు వీహెచ్‌పీ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వంగ ప్రసాద్ తెలిపారు.

7న 'హలో బీసీ–చలో అమృత్‌సర్'

కామారెడ్డి అర్బన్ : ఈనెల 7న పంజాబ్ అమృత్‌సర్‌లో నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ 'హలో బీసీ–చలో అమృత్‌సర్' 9వ మహాసభలకు బీసీలు పెద్దఎత్తున తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి యు నాగరాజగౌడ్, జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు రాజయ్య తదితరులున్నారు.

అనారోగ్యంతో సొసైటీ డైరెక్టర్ మృతి

బిచ్కుంద(జుక్కల్) : బిచ్కుంద సొసైటీ డైరెక్టర్ గంగాధర్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. రాజుల్లా గ్రామానికి చెందిన గంగాధర్ డైరెక్టర్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటిదగ్గర మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల చైర్మన్ నాల్చర్ బాలాజీ, వైస్ చైర్మన్ యాదవరావు, సొసైటీ సిబ్బంది కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి సంతాపం తెలిపారు.

గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని కొమలంచ, సింగితం గ్రామాల్లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యతను తల్లులకు, గర్భిణులకు వైద్య ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి సాలోమి అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, గంగమణి తదితరులు ఉన్నారు.

మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా జ్యోతి

నిజాంసాగర్(జుక్కల్) : మండల పరిషత్ ప్రత్యేక అధికారిణిగా ఎం జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రత్యేక అధికారిగా ఉన్న విజయ్‌కుమార్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో హర్టికల్చర్, అండ్ సెరికల్చర్ అధికారిణిగా వచ్చిన జ్యోతి మండల ప్రత్యేక అధికారిణిగా బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారిణిగా వచ్చిన జ్యోతిని స్థానిక ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత ఘనంగా సన్మానించారు.

ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బాన్సువాడ రూరల్ : ఆదివాసీ దినోత్సవాన్ని మంగళవారం జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొంకి గణేశ్ కోరారు. ఆదివాసుల మూలాలను పరిరక్షించాలన్నారు.

నాగిరెడ్డిపేట ఎస్సైగా మల్లారెడ్డి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ఎస్సైగా పి మల్లారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మెదక్ జిల్లా చేగుంట ఎస్సై–2గా విధులు నిర్వహించిన మల్లారెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కామారెడ్డి జిల్లాకు వచ్చారు. నాగిరెడ్డిపేట ఎస్సైగా విధులు నిర్వహించిన రాజు మెదక్ జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే.